నమస్తే తెలంగాణ

# నల్లగొండ

3 | నల్లగొండ, ఆదివారం 18 ఆగస్టు 2024 | NALGONDA




నల్లగొండలో అగ్రిషోలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, వేదికపై మండలి చైర్మన్ గుత్తా, మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీఎల్‌ఆర్, కలెక్టర్ నారాయణరెడ్డి, రైతుబడి నిర్వాహకుడు రాజేందర్‌రెడ్డి

## వరికి బదులు వాణిజ్య పంటలు సాగు చేయాలి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- వ్యవసాయ రంగంలో నూతన మార్పులు, యాంత్రీకరణ రావాలి
- శాసన మండలి చైర్మన్ గుత్తా, మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, ఆగస్టు 17 : రైతులు వరికి బదులు వాణిజ్య పంటల వైపు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సాంకేతిక సమస్యలతో రాష్ట్రంలో 10వేల నుంచి 12వేల మంది రైతులకు రుణమాఫీ జరుగలేదని, వారందరికీ త్వరలోనే అందజేస్తామని తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో రైతుబడి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అగ్రిషోను శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ తమ ప్రభుత్వం మూడు విడుతల్లో 22లక్షల మందికి రూ.18వేల కోట్లు మాఫీ చేసిందన్నారు. రెండు లక్షలకు పైగా రుణం తీసుకున్న రైతులు అదనపు సొమ్మును బ్యాంకులో చెల్లిస్తే వెంటనే రూ.రెండు లక్షలు వారి ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం రంగంలో ఇంకా నూతన మార్పులు, యాంత్రీకరణ రావాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని మూడేండ్లలో పూర్తి చేసి సాగు నీరు అందిస్తామన్నారు. అగ్రి షోలో 90కి పైగా వ్యవసాయ అనుబంధ స్టాళ్లను ఏర్పాటు చేయగా, రైతులు పెద్ద సంఖ్యలో సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. రైతు బడి నిర్వాహకుడు జూలకంటి రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేశ్, ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.





జీనెక్స్ సీడ్స్ స్టాల్‌ను సందర్శించి విత్తన వెరైటీలను తెలుసుకుంటున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల, మండలి చైర్మన్ గుత్తా, మంత్రి కోమటిరెడ్డి

## పిల్లల దత్తత కోసం దరఖాస్తు చేసుకోవాలి

- సీడబ్ల్యూసీ చైర్మన్ జయశ్రీ

భువనగిరి అర్బన్, ఆగస్టు 17: పిల్లను దత్తత తీసుకునే తల్లిదండ్రులు కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు సీఏఆర్‌ఏ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ సూచించారు. శనివారం పట్టణంలోని బాల సంరక్షణ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యాదాద్రి జిల్లాలో 8 చైల్డ్ కేర్ సెంటర్లు ఉన్నాయని, వాటిల్లోని 14 మంది పిల్లలను ఇప్పటి వరకు దత్తత ఇచ్చామని తెలిపారు. ఇంకా దత్తతకు అర్హులైన 16 మంది పిల్లలు ఉన్నారన్నారు. దత్తతపై ఆసక్తి ఉన్న వారు సీఏఆర్‌ఏ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని బాలరక్షా భవన్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో సభ్యులు మల్లేశం, ఇస్తారి, రుద్రమాదేవి, బాలల పరిరక్షణ అధికారి సైదులు పాల్గొన్నారు.

## 2 క్రస్ట్ గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నందికొండ, ఆగస్టు 17 : శ్రీశైలం నుంచి 67,210 క్యూసెక్కుల వరద వస్తుండడంతో నాగార్జునసాగర్ రెండు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే మీదుగా 19,880 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7,518, కుడి కాల్వ ద్వారా 8,221, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,191, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1,800, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. పైనుంచి వచ్చే వరద ఆధారంగా క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తామని ఎన్నెస్పీ అధికారులు తెలిపారు.



నాగార్జునసాగర్ డ్యామ్ క్రస్ట్ గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

# కాంగ్రెస్ సర్కార్ కనుసన్నల్లోనే హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయంపై దాడి

**రుణమాఫీపై రచ్చ జరుగుతుందనే డైవర్ట్ చేయడానికి కుట్ర**

- రూ.49వేల కోట్ల మాఫీ అని చెప్పి చేసింది రూ.17వేల కోట్లే
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



నల్లగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు

నల్లగొండ, ఆగస్టు 17 : రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు ఏడాది పాలన గడువక ముందే హింసకు తెరతీసిందని, మాజీ మంత్రి హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడి అందులో భాగమేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. నల్లగొండ పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడిని ఖండించారు. ఇది అల్లరిమూకలు చేసిన దాడి కాదని, స్వయంగా రాష్ట్ర ప్రభుత్వం కనుసన్నల్లోనే జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ చేసే ఇలాంటి చిల్లర వేషాలకు బీఆర్‌ఎస్ భయపడదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ముందు చంద్రబాబు, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి వేసిన ఎత్తులను కూడా చిత్తు చేసి రాష్ట్రం సాధించిన కేసీఆర్, బీఆర్‌ఎస్ అన్నది గుర్తుంచుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎలాంటి భౌతిక దాడులకు పాల్పడకుండా సంక్షేమ పాలన అందించిన విషయం ప్రజలకు తెలుసని, ఏడాది కాలంలోనే భౌతిక దాడులు మొదలుపెట్టిన కాంగ్రెస్ రాక్షసాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిన విషయం రైతులకు గమనించారని, ఈ విషయంపై రైతులు ఎక్కడ రోడ్లు ఎక్కుతారో అని ముందస్తు కుట్రతోనే ఈ దాడులు జరిపి మీడియాను, ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో రాహుల్, రేవంత్ రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రకటించి 50లక్షల మంది రైతులకు రూ.49వేల కోట్లు కావాలన్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. తర్వాత రూ.39వేల కోట్లు.. మరోసారి రూ.36వేల కోట్లు అన్న మీరు రూ.31వేల కోట్లు మాఫీ చేస్తామని క్యాబినెట్‌లో తీర్మానించి బడ్జెట్‌లో రూ.26వేల కోట్లు కేటాయించి చివరకు చేసింది రూ.17వేల కోట్లేనని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలో లక్ష రూపాయల్లోపే 36లక్షల మందికి రూ.17వేల కోట్లు మాఫీ చేస్తే కాంగ్రెస్ 22 లక్షల మందికి రూ.17వేల కోట్లే మాఫీ చేసి అందరికీ చేశామని చెప్పడం మోసం కాదా? అని నిలదీశారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ జరుగనందున రైతులు ఎక్కడ గగ్గోలు పెడుతారోనని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు హరీశ్‌రావుపై అనవసరమైన ఆరోపణలు చేసి సీఎం ఇంకా దిగజారుతున్నారని పేర్కొన్నారు. బీజేపీలో కలిసేది బీఆర్‌ఎస్ కాదని, ఆయనే త్వరలో బీజేపీలో చేరుతాడని ఆ పార్టీ మంత్రులే అనుకుంటున్నట్లు చెప్పారు. ఇంకా నాలుగేండ్ల పాలనలో ఎన్ని మోసాలు చేస్తాడో రైతులు గమనించాలన్నారు. రెండు లక్షలకు పైగా రుణం తీసుకున్న రైతులు మిగిలిన డబ్బు చెల్లిస్తే రెండు లక్షలు మాఫీ చేస్తామని చెప్పడం కొత్త మోసమన్న జగదీశ్‌రెడ్డి.. ముందు రెండు లక్షల వరకు బ్యాంకులకు పంపాలని, మిగిలిన మొత్తం రైతులే కట్టుకుంటారని డిమాండ్ చేశారు. ఆధార్‌లో తప్పులని, పేరులో తప్పులని, పాస్‌బుక్ తప్పుందని కాకమ్మ కథలు మానాలని హితవు పలికారు. ఎక్కడ తప్పులున్నా బ్యాంకర్లు రుణమే ఇవ్వరనే విషయం గమనించాలన్నారు. ఓట్ల కోసం ఆనాడు సకల అబద్ధాలు ఆడి ఈ రోజు రుణం ఎగ్గొట్టాలనే ఆలోచనతో కుట్రలు చేస్తున్న రేవంత్ సర్కార్‌ను రైతులు నిలదీయాలని, బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. 45 శాతం రుణాలు మాఫీ చేసి 55 శాతం ఎగ్గొట్టడం సరికాదని, వెంటనే అందరికీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రైతులకు బీఆర్‌ఎస్ శ్రేణులు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశంలో అత్యధికంగా వరి పండించిన రాష్ట్రంగా తెలంగాణ, తెలంగాణలో నల్లగొండ ఉంటే గత యాసంగిలో నాశనం చేశారని మండిపడ్డారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 15 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే గత యాసంగిలో 4లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే దిగుబడి వచ్చిందని తెలిపారు. రైతులకు అన్యాయం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి.. పెండింగ్‌లో ఉన్న గత రైతు బంధు రూ.4,500 కోట్లు వెంటనే విడుదల చేసి ఈ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కింద ఎకరాకు రూ.7,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. నల్లగొండలో బీఆర్‌ఎస్ ఆఫీస్ నిర్మాణం ఆ పార్టీ ఆఫీసుల మాదిరిగానే జరిగిందని, మంత్రి చెప్పిండని అధికారులు కూలగొడితే కోర్టు చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. నాలుగేండ్ల తర్వాత మళ్లీ బీఆర్‌ఎస్సే అధికారంలోకి వస్తుందని, అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నిరంజన్‌వలీ, చీర పంకజ్‌యాదవ్, కటికం సత్తయ్యగౌడ్, తండు సైదులు గౌడ్, బోనగిరి దేవేందర్, మాలె శరణ్యారెడ్డి, మందడి సైదిరెడ్డి, మాజీ ఎంపీపీ కరీంపాషా, మైనం శ్రీనివాస్, ఐతగోని యాదయ్య, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, లొడంగి గోవర్ధన్, దోటి శ్రీనివాస్, రావుల శ్రీనివాసరెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

# మూడో విడుతలోనూ మొండిచెయ్యి..

## అందని ద్రాక్షగానే రైతు రుణమాఫీ

- తాజా జాబితాలోనూ పేర్లు లేకపోవడంతో అన్నదాతల నిరాశ
- బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- రేవంత్‌రెడ్డి సర్కారును దుమ్మెత్తిపోస్తున్న రైతాంగం

**రైతు రుణమాఫీ అంతుచిక్కని ప్రశ్నగా మారింది. మొన్నటి వరకూ అదిగో వస్తుంది.. ఇదిగో వస్తుంది అని కాలం నెట్టుకొచ్చిన సర్కారు మూడో విడుతలోనూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చాలామంది రైతులకు మొండిచెయ్యి చూపింది. దాంతో ఈసారైనా మాఫీ అవుతుందని ఆశపడ్డ అన్నదాతలకు నిరాశే ఎదురైంది. ఎందుకు మాఫీ కాలేదో కారణం కూడా తెలియకపోవడంతో బాధితులు బ్యాంకులు, వ్యవసాధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.**

సూర్యాపేట, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ)



### ఎట్టకేలకు జాబితా విడుదల..

రాష్ట్ర ప్రభుత్వం మూడు విడుతల్లో రుణమాఫీ చేసింది. ఇప్పటికే రెండు విడుతలు పూర్తికాగా, పంద్రాగస్టు రోజు నుంచి మూడో విడుత అమలు చేస్తున్నది. మూడో విడుత జాబితాను మాత్రం విడుదల చేయలేదు. దాంతో ఎవరికి మాఫీ అయ్యింది.. ఎవరికి కాలేదు అనే దానిపై స్పష్టత లేక రైతులు ఆందోళన చెందారు. ఎట్టకేలకు శుక్రవారం రాత్రి తర్వాత లబ్ధిదారుల జాబితా విడుదలైంది. వాస్తవంగా.. అనేకమంది అర్హులైనా మొదటి, రెండు విడుతల్లో పేర్లు రాలేదు. మొదటి విడుత సమయంలో అధికారులను సంప్రదిస్తే రెండో విడుతలో వస్తుందన్నారు. రెండో విడుతలో అడిగితే మూడో విడుత అని దాటవేస్తూ వచ్చారు. ఇప్పుడు తాజా జాబితాలోనూ పేర్లు లేకపోవడంతో అనేక మంది రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

### బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు..

మూడో విడుత జాబితా రావడంతో లబ్ధిదారులు తమ పేర్లను చెక్ చేసుకుంటున్నారు. ఇందులోనూ పేర్లు లేకపోవడంతో బ్యాంక్‌లు, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికే కొందరు రైతులు నాలుగైదు సార్లు కూడా ఆఫీసుల చుట్టూ తిరుగుతూ వివరాలాను తెలుసుకుంటున్నారు. ఇప్పటి దాకా రెండో, విడుతలో వస్తాయని చెప్పి తప్పించుకున్న అధికారులు.. ఇప్పుడు మాత్రం తామేం చేయలేమని చేతులెత్తేస్తున్నారు.

### వాళ్లు ఆశలు వదులుకోవాల్సిందేనా?

క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలిస్తే.. ముఖ్యంగా ఇంట్లో రేషన్ కార్డు లేనివాళ్లకు, రెండు లక్షల కంటే ఎక్కువ రుణం తీసుకున్నవాళ్లకు మాఫీ కాలేదని తెలుస్తున్నది. రేషన్ కార్డుతో సంబంధం లేదని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించినా, ఆచరణలో మాత్రం అమలు కాలేదు. అంతేగాక ఒకే ఇంట్లో భార్య రూ.1.50లక్షలు, భర్త లక్ష రుణం తీసుకుంటే మొత్తం రూ. 2.50 లక్షలు అవుతుండటంతో వారికి మాఫీ వర్తింపజేయలేదు. అలాంటి వాళ్ల పరిస్థితి ఏంటి? రుణమాఫీ వస్తుందా, రాదా! ఆశలు వదులుకోవాల్సిందేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కనీసం ఇంట్లో ఎవరికో ఒకరికైనా మాఫీ చేయకపోవడంపై కడుపు మండిన లబ్ధిదారులు సర్కారును దుమ్మెత్తి పోస్తున్నారు.

### రుణమాఫీ అనేది ఒక బూటకం



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, రైతులంతా బ్యాంకుల్లో రుణాలు తెచ్చుకోవాలని రేవంత్‌రెడ్డి ఆ రోజు చెప్పిండు. ముఖ్యమంత్రి అయినంక రుణమాఫీకి సవాలక్ష కొర్రీలు పెడుతుండు. నాకు, నా భార్యకు కలిపి స్టేట్ బ్యాంకులో రూ.3లక్షల క్రాప్ లోన్ ఉంది. ఇచ్చిన హామీ ప్రకారం మాకు రూ.2లక్షల రుణ మాఫీ చేస్తే ఆనందించేవాళ్లం. కానీ.. రూ.2లక్షలకు పైగా ఉన్న డబ్బులు కట్టుకోవాలి, గ్రీవెన్స్ డేలో దరఖాస్తు చేసుకోవాలని లింకులు పెడుతున్నారు. దరఖాస్తు చేసుకుంటే మళ్లీ ఆన్‌లైన్ చేసి ప్రభుత్వానికి పంపిస్తే రుణమాఫీ వస్తుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు దాటింది. ఇంకా మాయమాటలు చెబుతున్నారు. చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రుణ మాఫీ చేయాల్సిందే. మాట తప్పితే రైతులంతా తగిన విధంగా గుణపాఠం చెప్తారు.

**- పాశం యాదగిరిరెడ్డి, రైతు, దొండవారిగూడెం, మిర్యాలగూడ మండలం**

### రుణమాఫీ పేరుతో ప్రభుత్వం రైతులను వంచించింది



హాలియా యూనియన్ బ్యాంకులో నాకు రూ.లక్షా 60వేల లోన్ ఉంది. కానీ.. నా పేరు ఏ జాబితాలోనూ లేదు. రుణమాఫీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రైతులను వంచించింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్‌లో రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు సాకులు వెతుకుతున్నారు. లక్ష రూపాయలు ఒకసారి, లక్షన్నర ఒకసారి, రెండు లక్షలు ఒకసారి మాఫీ చేస్తున్నామని పేర్కొన్నారు. పూర్తిస్థాయి రుణమాఫీ మాత్రం చేయడం లేదు.

**- ఉడ్తూరి శ్రీనివాస్‌రెడ్డి, రైతు, కొత్తపల్లి, అనుముల మండలం**

### నయా పైసా మాఫీ కాలేదు..



గత ఎన్నికల్లో అది చేస్తాం.. ఇది చేస్తామని అబద్ధాలు చెప్పి రైతులతో ఓట్లు వేయించుకున్నారు. గెలిచిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు. రుణమాఫీ అన్నారు కానీ.. అది ఎవరికి వచ్చిందో, ఎవరికి రాలేదో అర్థం కావట్లేదు. నేను రూ.1.60లక్షల పంట రుణం తీసుకున్నా. రుణమాఫీ చేస్తామంటే ఆ డబ్బులు వ్యవసాయానికి అక్కరకు వస్తాయనుకున్నాం. కానీ.. నయా పైసా కూడా మాఫీ కాలే. ఇంతవరకూ రైతు భరోసా డబ్బులు కూడా వేయలేదు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలతో ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్నారు. రైతులందరూ ఏకమై ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్తారు.

**- మునగాల అంజిరెడ్డి, రైతు, కుక్కడం, మాడ్గులపల్లి మండలం**

## కొత్తపల్లి సహకార సంఘంలో సగం మందికే రుణమాఫీ

హాలియా, ఆగస్టు 17 : అనుముల మండలం కొత్తపల్లి సహకార సంఘంలో మొత్తం 1,326 మంది రైతులు రుణమాఫీకి అర్హులు కాగా.. ఇప్పటి వరకు 643 మందికే మాఫీ అయ్యింది. కొత్తపల్లి పీఏసీఎస్‌లో మొదటి విడుతలో 373మంది రైతులకు, రెండో విడుతలో 170, మూడో విడుతలో వంద మంది రైతులకు రుణమాఫీ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. కొత్తపల్లి సహకార సంఘానికి రూ.7.5 కోట్లు రుణ మాఫీ కింద రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.3,13,75,000 మాత్రమే సొసైటీ ఖాతాల్లో జమ అయ్యాయి. దీంతో రుణమాఫీ కాని రైతులు తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు.

## వైద్యురాలి హంతకులను కఠినంగా శిక్షించాలి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైద్యుల నిరసన



నల్లగొండలో ధర్నా చేస్తున్న వైద్యులు సిబ్బంది

నల్లగొండ, ఆగస్టు 17 : పశ్చిమ బెంగాల్‌లో వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. శనివారం అత్యవసర సేవలు మినహా వైద్య సేవలన్నింటినీ నిలిపివేసి ర్యాలీలు, ఆందోళనలు నిర్వహించారు. నల్లగొండలో ఐఎంఏ నీలగిరి బ్రాంచ్, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్స్, మెడికల్ స్టూడెంట్స్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి క్లాక్ టవర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. సూర్యాపేట ఆసుపత్రుల్లో ఓపీ సేవలను బంద్ చేసి వైద్యులు, సిబ్బంది నిరసనలో పాల్గొన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి కర్నల్ సంతోష్‌బాబు చౌరస్తా మీదుగా కొత్త బస్టాండ్ వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. భువనగిరిలో ప్రభుత్వ ఏరియా దవాఖాన నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. బీబీనగర్‌లో ఎయిమ్స్ నుంచి పట్టణ కేంద్రం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు మాట్లాడుతూ ప్రజలను అనారోగ్యం నుంచి రక్షించే డాక్టర్లకు రక్షణ లేకపోవడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## ఉత్తమ్ ఇలాకాలో 59.77 శాతమే మాఫీ

- హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం రుణం తీసుకున్న రైతులు 11,053 మంది..
- మాఫీ పొందిన వారు 6,607 మాత్రమే..

నేరేడుచర్ల, ఆగస్టు 17 : క్రాప్ లోన్ తీసుకున్న వారికి ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ప్రకటించడంతో రైతులు ఆనందంలో మునిగిపోయారు. కానీ.. ప్రభుత్వం పెట్టిన నిబంధనలు. బ్యాంకుల కొర్రీలతో సగం మంది రైతులకు నిరాశే మిగిలింది. రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మూడు విడుతల్లో 59.77 శాతానికి మించి రైతులకు లబ్ధి చేకూరలేదు. దీంతో రైతులు పాస్ బుక్కులు తీసుకొని వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రుణ మాఫీ విషయమై ఏఓ కార్యాలయాలకు దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. హుజూర్‌నగర్ నియోజకవవర్గంలోని 7 మండలాల్లో మొత్తం 17 సొసైటీలు ఉన్నాయి. వాటి పరిధిలో 11,053 మంది రైతులు వివిధ బ్యాంకుల్లో క్రాప్ లోన్లు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు విడుతల్లో చేసిన రుణమాఫీలో 6,607 మంది రైతులకు రుణమాఫీ నగదు జమ అయ్యింది. మిగిలిన 4,436 మందికి రుణ మాఫీ కాలేదు. ప్రభుత్వం విధించిన పరిమితిలోపు రుణాలున్నవారికి సైతం అనేక మంది రైతులకు రుణ మాఫీ వర్తించలేదు. దీంతో రుణమాఫీ సమాచారాన్ని తెలుసుకునేందుకు రైతులు బ్యాంకులు, సొసైటీల వద్దకు వెళ్తున్నారు. వ్యవసాయ అధికారులకు ఫోన్లు చేసి ఆరా తీస్తున్నారు. మరి కొంత మంది రైతులు రుణమాఫీ కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు.

| మండలం | సొసైటీలు | రుణం పొందిన రైతులు | మాఫీ కాని రైతులు |
|---|---|---|---|
| నేరేడుచర్ల | 3 | 2,007 | 855 |
| గరిడేపల్లి | 4 | 2,680 | 1,021 |
| మఠంపల్లి | 1 | 896 | 313 |
| పాలకవీడు | 1 | 1,342 | 692 |
| హుజూర్‌నగర్ | 4 | 2,345 | 901 |
| మేళ్లచెర్వు | 2 | 1,143 | 452 |
| చింతలపాలెం | 2 | 640 | 202 |
| మొత్తం | 17 | 11,053 | 4,436 |


